క్లుప్తంగా

జగనన్న కాలనీలో గృహ ప్రవేశాలు



రిబ్బన్ కట్‌చేసి గృహాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి దంపతులు

ద్వారకాతిరుమల: గుండుగొలనుకుంట గ్రామంలోని జగనన్న కాలనీలో ఐదు నిరుపేద కుటుంబాలు గురువారం ఆనందోత్సాహాల నడుమ గృహ ప్రవేశాలు చేశాయి. స్థానిక సర్పంచ్ బండారు ధనలక్ష్మి, కాశీ రామేశ్వర రావు దంపతులు ముందుగా రిబ్బన్ కట్ చేసి ఇళ్లను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులు అప్పసాని సత్తెమ్మ, అప్పసాని మహాలక్ష్మి, అప్పసాని సుబ్బమ్మ, పలిమిల అనూష, గుడె సత్యవతి గృహ ప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు వారికి నూతన వస్త్రాలను బహుకరించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ సొంతింటి కలను జగనన్న నెరవేర్చారన్నారు. ఒకొక్కరికి సెంటున్నర స్థలాన్ని, గృహ రుణాలను ఇచ్చి సొంత గూడును ఏర్పరిచారని అన్నారు. అనంతరం సర్పంచ్ ధనలక్ష్మి మాట్లాడుతూ సొంతింటి కల నెరవేరిన వేళ నిరుపేదల కళ్లల్లో ఆనందాన్ని చూస్తున్నామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిరుపేదలకు అంతా మంచే జరిగిందనడానికి వీరే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పలిమిల ఆంజనేయులు, బండారు వెంకన్నబాబు, బండారు నాగ సుబ్బారావు తదితరులున్నారు.

శ్రీవారి సేవలో...



ఆలయంలో కుటుంబ సమేతంగా క్రాంతి కుమార్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ క్రాంతి కుమార్ గురువారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. తాను ఇప్పటి వరకు పలసా, ఉప్పెన వంటి ఎన్నో చిత్రాల్లో నటించానని, ప్రస్తుతం పుష్పా–2, గేమ్‌ఛేంజర్ తదితర చిత్రాల్లో నటిస్తున్నట్టు చెప్పారు.

18న సీతారామ విగ్రహాల ప్రతిష్ఠాపన



సీతారామ లక్ష్మణ మూల విరాట్, ఉత్సవ విగ్రహాలు

కొయ్యలగూడెం: అచ్చుతాపురం గ్రామంలో ఈనెల 16వ తేదీ నుంచి శ్రీ సీతారామ లక్ష్మణ హనుమద్ విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవం గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మద్దిపాటి నాగమణి తెలిపారు. ఈ నేపథ్యంలో 18వ తేదీన ఉదయం 8.15 గంటలకు ఆలయంలో నూతన విగ్రహాలను పునః ప్రతిష్ఠ చేయనున్నట్లు చెప్పారు. ఆరోజు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

యడవల్లిలో 114 మందికి వైద్యపరీక్షలు



శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

లింగపాలెం: యడవల్లి గ్రామంలో గురువారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఏలూరుకు చెందిన గుడ్‌సమరిటన్ క్యాన్సర్ హాస్పటల్, శంకర నేత్ర హాస్పటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరాన్ని సర్పంచ్ కట్టుబోయిన రమేష్ ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఆదిత్య, డాక్టర్ చంద్ర, డాక్టర్ బాషా 114 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

కామవరపుకోట: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తడికలపూడి ఎస్సై కె.జయబాబు గురువారం తెలిపారు. వివరాల ప్రకారం .. వడ్లపల్లి నూతన గ్రామానికి చెందిన దేవరపల్లి ప్రసాద్‌కు, నాగలక్ష్మికి 14 సంవత్సరాల క్రితం వివాహమైంది. గత కొంతకాలంగా భార్యతో తరచూ గొడవలు పడడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయి ప్రసాద్‌పై దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు భార్యభర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చి సవ్యంగా కాపురం చేసుకోమని పంపించారు. కానీ భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన ప్రసాద్ ఈనెల 12వ తేదీ రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటినుంచి వెదికినా ఆచూకీ తెలియకపోవడంతో ప్రసాద్ తండ్రి దేవరపల్లి సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జయబాబు చెప్పారు.

వైఎస్సార్ సీపీ విజయబావుటా ఎగురవేయాలి

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- నియోజకవర్గ స్థాయి సేవాదళ్ ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం



వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బాలరాజు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మితో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న పార్టీ నేతలు

బుట్టాయగూడెం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయబావుటా ఎగురవేసేలా ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసుకుంటూ సేవాదళ్ కార్యకర్తలు పని చేయాలని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. స్థానిక సొసైటీ సమీపంలో గురువారం పోలవరం నియోజకవర్గ స్థాయి సేవాదళ్ ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ 2019లో పార్టీ విజయం కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పించారని చెప్పారు. భవిష్యత్‌లో నాయకులుగా ఎదిగేందుకు పార్టీ మంచి అవకాశాలను కల్పిస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు మరింత అవగాహన కలిగించాలని చెప్పారు. నవరత్న పథకాలే పార్టీ గెలుపునకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామస్థాయిలో ప్రభుత్వ పాలన అందుబాటులోకి వచ్చిందని అన్నారు. గతంలో పింఛను కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద గంటల తరబడి పడిగాపులు కాసేవారన్నారు. నేడు ఆ పరిస్థితి లేదని వలంటీర్ల ద్వారా నేరుగా తెల్లవారుజామునే అర్హులకు పింఛన్లు అందించడం జరుగుతుందని చెప్పారు. అలాగే రేషన్ బియ్యం కూడా ఇంటికే వచ్చి చేరుతున్నాయని తెలిపారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, ఆసరా, చేయూత, వంటి అనేక పథకాల అమలులో ఎటువంటి లంచాలకు తావులేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులకు అందిస్తున్నారని అన్నారు. పేదలకు మరింత మేలు జరగాలంటే మళ్లీ జగనన్నే సీఎంగా రావాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సేవాదళ్, పార్టీ విభాగాల్లో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని కోరారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలిస్తేనే పనిచేసే వారికి పదవులు లభిస్తాయని అన్నారు. పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలందరూ చేయిచేయి పట్టుకుని పార్టీ విజయానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. వైఎస్సార్‌సీపీ సేవాదళ్ ఏలూరు జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ చినిమిల్లి వెంకటరాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ వైస్ ప్రెసిడెంట్ గంజి కిషోర్, ఏపీ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, జిల్లా ఎంపీపీల ఛాంబర్ అధ్యక్షులు సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఏపీ గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ తెల్లం చిన్నారావు, ఎంపీటీసీ తెల్లం రమణ, పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, చందా ప్రసాద్, అదేవిధంగా బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం, కొయ్యలగూడెం, టి. నర్సాపురం మండలాలకు చెందిన సేవాదళ్ ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా నివారణకు ప్రత్యేక చర్యలు



విలేకర్లతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ మేరీ కేథరిన్

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కేఆర్‌పురం ఐటీడీఏ డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ మేరీ కేథరిన్ తెలిపారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 2047 సంవత్సరం నాటికి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి పూర్తి నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా ఈ వ్యాధిపై అవగాహన, నివారణ చర్యలపై గిరిజన గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. సికిల్‌సెల్ ఎనీమియాపై కోయ, గిరిజన భాషలో కరపత్రాలను తయారు చేసి పంచడంతో పాటు కళాజాత కార్యక్రమాన్ని కూడా చేస్తున్నామని చెప్పారు. అలాగే కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడంతోపాటు 29,125 మందికి రక్త పరీక్షలు చేశామని, 20,750 మంది వివరాలను యాప్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. 32 మందికి సికిల్‌సెల్ ఎనీమియా ఉన్నట్టుగా గుర్తించామని, ఇది 50 మంది వరకూ ఉండొచ్చని అంచనా వేస్తున్నామన్నారు. వీరందరికీ మెరుగైన వైద్యం అందించే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు.

అభివృద్ధికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్

- ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం



కామవరపుకోట నుంచి ఈస్ట్ యడవల్లి వరకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు

కామవరపుకోట: దేశంలోనే అభివృద్ధికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిలుస్తుందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలో గురువారం ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజుతో కలిసి ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. వీరిశెట్టిగూడెంలో నూతనంగా రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.18 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ కేర్ క్లినిక్ సెంటర్‌ను, గత 2 దశాబ్దాల నుంచి అభివృద్ధికి నోచుకోని కామవరపుకోట నుంచి ఈస్ట్ యడవల్లి వరకు రూ.4 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంకాలంపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని జలపవారిగూడెంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, తడికలపూడిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.18 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ కేర్ క్లినిక్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గతంలో టీడీపీ నయవంచన పాలనతో రాష్ట్ర ప్రజలు అభివృద్ధికి నోచుకోక ఆర్థికంగా అల్లాడిపోయారన్నారు. కానీ పాదయాత్ర సమయంలో ప్రజల కష్టాలను, ఇబ్బందులను చూసి చలించిపోయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నూటికి 99 శాతం నెరవేర్చి దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే ఏపీని అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచారన్నారు. అందుకే నేడు మిగతా రాష్ట్రాలు సంక్షేమ పథకాల అమలులో ఏపీని ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష నాయకులు ఎన్ని ఎత్తుగడలు వేసినా, ఎంతమంది కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీ 175 సీట్లు గెలుపు సాధించడం ఖాయమని, రానున్నది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనమే అని ధీమా వ్యక్తం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరు సునీల్ కుమార్‌ను, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజును అధిక మెజార్టీతో గెలిపించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్‌బాబు, మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ కీసరి సరితరెడ్డి, సొసైటీ చైర్మన్ సాయిన కనకరాజు, సర్పంచులు దేవరపల్లి రామ్మోహన్‌రావు, కరిపోతూ అనూష, కొత్తపల్లి రజిని శ్రీనివాస్, చొక్కా స్వర్ణ, ఉప సర్పంచ్‌లు మేడూరు రంగబాబు, కీసరి శ్రీహరిరెడ్డి, జిల్లా ఎస్సీ ఎస్టీ కేసుల విజిలెన్స్ మోనిటరింగ్ మెంబర్ గుర్రాల రవికుమార్, ఎంపీటీసీలు బొప్పన చైతన్యకుమార్, గోరిక క్రాంతికుమార్, గంగుల కడియాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్



కోయరాజమండ్రిలో సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ గిరిజనులకు దిశానిర్దేశం చేసిన మహనీయుడని ఎస్టీ బంజారా సుగాలి(లంబాడీ) సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు భుక్యా నాగేశ్వరరావు నాయక్ అన్నారు. మండలంలోని కోయరాజమండ్రిలో సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠతోపాటు నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ బంజారాల జీవన విధానంలో మార్పులు తీసుకువచ్చిన మహనీయుడు సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో రెండు ఎమ్మెల్యే సీట్‌లు, ఒక ఎంపీ సీట్‌ను బంజారా లంబాడీలకు కేటాయించాలన్నారు. బుట్టాయగూడెం మండల వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు మాట్లాడుతూ గిరిజన జాతికి సంత్ సేవాలాల్ మహరాజ్ చేసిన సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు చేసిన సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బానోతు బాబూరావు నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బానోతు శ్రీరామ్‌మూర్తి నాయక్, బానోతు సురేష్ నాయక్, బానోతు కృష్ణ నాయక్, బానోతు జశ్వంత్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



ఈస్ట్ యడవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న విజయకృష్ణ

కామవరపుకోట: తూర్పుయడవల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను, ఫౌండేషన్ ప్లస్ స్కూల్‌ను జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ గురువారం తనిఖీ నిర్వహించారు. అటెండెన్స్, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించి విద్యార్థులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సమాచారంపై అంగన్‌వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరుపున వారికి అందుతున్న పోషకాహారం సరఫరా వివరాలను గమనించారు. స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం విద్యార్థుల హాజరు ఉండాలని, సమయానికి వారికి పోషకాహారం అందించాలని, విద్యాబుద్దులు చెప్పాలని, తదనుగుణంగా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించే బాధ్యత కూడా మీదేనని సిబ్బందికి సూచించారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపం లేకుండా చేయాలనే దృఢ సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, అమలులో ఎటువంటి లోపాలున్నా వెంటనే తగిన చర్యలు తీసుకునే విధంగా సంబంధిత అధికారులకు నివేదిక సమర్పిస్తామని విజయకృష్ణ తెలిపారు.

ఆటో డ్రైవర్లు వేగ నియంత్రణ పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్

జంగారెడ్డిగూడెం: ట్రాఫిక్ వారోత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలో ఆటో డ్రైవర్లకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్, ట్రాఫిక్ ఎస్సై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలకు సర్వీస్ చేసే ఆటోలకు ట్రాఫిక్ నిబంధనల ప్రకారం సీరియల్ నెంబర్ స్టిక్కర్లను అతికించారు. అనంతరం సీఐ రాజేష్ మాట్లాడుతూ యువకులు బైకులపై వెళ్లేటప్పుడు హెల్మెట్‌ధరించాలని, కార్లలో సీట్ బెల్ట్ తప్పనిసరి అని, అలాగే ఆటో డ్రైవర్లు కచ్చితంగా యూనిఫాం ధరించాలన్నారు. అధిక లోడు, అతి వేగం మంచిదికాదని సూచించారు. ఇంటి వద్ద ఎదురుచూసే తల్లిదండ్రులు, భార్య, బిడ్డలను దృష్టిలో పెట్టుకోని ప్రతిఒక్కరూ వేగనియంత్రణ పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై చిన్నతనం నుంచే ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనలు విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

కొయ్యలగూడెం: డ్రైవర్లకు ఉరితాడులా మారిన ప్రమాదకర చట్ట నిబంధనలను వ్యతిరేకిస్తూ శుక్రవారం నిర్వహించే దేశవ్యాప్త నిరసన ప్రదర్శనలు విజయవంతం చేయాలని చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు ఆటో డ్రైవర్ల మీటింగ్‌లో మాట్లాడుతూ ఈ చట్టంపై పార్లమెంట్లులోనైనా సవివరమైన చర్చ జరగకుండా ప్రతిపక్షాన్ని సభ నుంచి గెంటేసి 2023 డిసెంబర్ 21న పార్లమెంటు ఆమోదం చేయటం చాలా దుర్మార్గం అన్నారు. రహదారి నిర్మాణ లోపాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, జరిమానాలు శిక్షలు భారీగా పెంచితే ప్రమాదాలు తగ్గుతాయా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఉసే జయరాజు, గెలం సత్యనారాయణ, షేక్ అమీర్ భాష, కేజాన్, చింతా పవన్, చొక్కా వెంకటేష్, చాపల రాంబాబు, వేమన వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

నేడు రథసప్తమి వేడుకలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 8.30 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఆవు పిడకలపై పాలు పొంగించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

మాలమహానాడు కార్యకర్తల సమావేశం

జంగారెడ్డిగూడెం: మాల మహానాడు రాష్ట్ర లీగల్ కార్యదర్శి తోర్లపాటి శ్రీనివాస్ అధ్యక్షతన పట్టణంలో గురువారం అత్యవసర కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ మాట్లాడుతూ భూహక్కు చట్టం వలన సన్న, చిన్న కారు రైతులు మధ్యతరగతి రైతులు నష్టపోతారని, ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుండె నగేష్‌బాబు, ఉపాధ్యక్షుడు సరళ రఘు, పట్టణ అధ్యక్షులు వెంపల రాజు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ పోలవరంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: కార్మికులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం తలపెట్టిన దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు పిలుపునిచ్చారు. మండలంలోని పంగిడిగూడెంలో గురువారం సమ్మె కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజల దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ కార్మికులు, రైతులు, చిరుద్యోగులు, దళిత బలహీన వర్గాలపై భారాలు మోపుతున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నిరసన కార్యక్రమాలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కర రావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నేత మానుకొండ వీర్రాజు, సీఐటీయూ నేతలు నాగలక్ష్మి, సుకేశిని, శైలజ తదితరులున్నారు.

పోలవరం రూరల్: అఖిల భారత గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్, ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోలవరంలోని ప్రధాన రోడ్డులో కరపత్రాలు పంపిణీ చేశారు. రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) జిల్లా అధ్యక్షులు కుంజం రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన అన్ని రకాల హామీలను అమలు చేయాలని, పంటలకు ఉత్పాదక ఖర్చులు 50శాతం కలిపి కనీస మద్దతు ధరను గ్యారెంటీ చేస్తూ చట్టాన్ని తీసుకురావాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బంద్‌కు వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు మీడియం పోసిరావు, కొమరం రామారావు తదితరులు పాల్గొన్నారు

జంగారెడ్డిగూడెం: భారత దేశ గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో గురువారం ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ నాయకులు మాట్లాడారు. పట్టణ అధ్యక్షులు పి.సూర్యరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కేవీ రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం మాట్లాడుతూ బంద్‌కు ప్రజలంతా పెద్ద ఎత్తున మద్దతు పలికి జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: తాడువాయి సెక్షన్ మైసన్నగూడెం సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. మైసన్నగూడెం, శ్రీనివాసపురం, పుల్లేపూడి గ్రామాలకు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్థిక సహాయం అందజేత



బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న బీవీఎస్ రెడ్డి

లింగపాలెం: తోచలకరాయుడుపాలెం గ్రామంలో వివిధ ఆరోగ్య కారణాలతో బాధపడుతున్న వారికి వైఎస్సార్ సీపీ నేత బీవీఎస్ రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన పింగుల కుటుంబరావుకు రెండు కిడ్నీలు పాడైపోవటంతో ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ కుటుంబం పడుతున్న ఆర్థిక ఇబ్బందులు తెలుసుకుని వైఎస్సార్ సీపీ నేత బీవీఎస్ రెడ్డి రూ.25 వేలు అందజేశారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన సిరా నాగేశు, మానికల రాములు, పట్నాల ప్రసాద్ వివిధ కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండంతో ఒకొక్క కుటుంబానికి రూ.10 వేలు చొప్పున రూ.30 వేలు నగదును బీవీఎస్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బి.ప్రభాకర్‌రెడ్డి, పింగుల వెంకటేశు, తగరం జయరాజు, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, రెడ్డి బాబ్జి, శావా రాజేష్, చిట్లూరి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు మొక్కలు, ఎరువుల పంపిణీ



గిరిజన రైతులకు జీడిమామిడి మొక్కలు, ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: జీడిమామిడి తోటలు సాగు చేసే రైతులు అంటు కట్టిన మొక్కల పెంపకం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవి తెలిపారు. మండలంలోని తెల్లంవారిగూడెంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయ మండలి కళాశాల ఆధ్వర్యంలో గిరిజన రైతులకు జీడిమామిడి సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ మాధవి మాట్లాడుతూ ఐసీఏఆర్, గిరిజన ఉప ప్రణాళిక 2023 ఆర్థిక సహాయంతో ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన జీడిమామిడి రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. జీడిమామిడి పంట సాగు, కుమ్మ కత్తిరింపులు, పోషక యాజమాన్యం, పంటలను చీడ పీడల నుంచి ఏ విధంగా కాపాడుకోవాలో అవగాహన కల్పించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం గిరిజన రైతులకు అవసరమైన రంపము, కొమ్మకత్తిరింపు, తదితర అవసరమైన పనిముట్లను అందజేశారు. అలాగే జీడిమామిడి మొక్కలు, ఎరువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.కల్పన, డాక్టర్ జి.పెద్దబాబు, శాస్త్రవేత్త డాక్టర్ ఛాందిని రాజ్, నవీన, మణిమాల, వంశీనాథ్, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.